సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.21,850
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.21,850, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.8°/09.2°

జిల్లా పరిధిలో బుధవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఉదయం 'చలిగింతలు'.. ఆపై 'సెగలు',

- ఉమ్మడి జిల్లాలో భిన్నమైన వాతావరణం



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఎండలు సుర్రుమనిపిస్తుండగా... వేకువజామున చలిగింతలు ఉంటున్నాయి. చాలా మండలాల్లో రాత్రిళ్లు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు 34 నుంచి 36 డిగ్రీల మధ్య రికార్డవుతున్నా.. రాత్రిళ్లు, వేకువజామున మాత్రం కనిష్ట స్థాయికి చేరుకుంటున్నాయి. చాలా మండలాల్లో వేకువజామున 9 నుంచి 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండు రోజులుగా పగటి పూట గాలి వేగం స్వల్పంగా పెరగడంతో ఎండ తీవ్రత తగ్గుముఖం పట్టింది. పామిడి, తాడిపత్రి, అనంతపురం, కూడేరు, గుంతకల్లు, తలుపుల, చెన్నేకొత్తపల్లి, కొత్తచెరువు తదితర మండలాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 35 నుంచి 36 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. కుందుర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం, కంబదూరు, రాప్తాడు, మడకశిర, గుడిబండ, తనకల్లు, సోమందేపల్లి తదితర మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు ఇంకా 10 నుంచి 12 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ఈనెలాఖరు వరకు వాతావరణ పరిస్థితులు ఇలాగే ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మార్చి నుంచి ఎండతీవ్రత 40 డిగ్రీల నుంచి ఇంకా పెరిగే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

రేపటి నుంచి అతిరుద్ర మహాయజ్ఞం

ప్రశాంతి నిలయం: సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకూ అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహించనున్నారు. విశ్వశాంతి, మానవాళికి మంచి జరగాలన్న ఆకాంక్షతో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న ఈ మహాయజ్ఞంలో పాల్గొనేందుకు దేశ విదేశాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.

'పురం' అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: హిందూపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు ఛాంబర్‌లో హిందూపురం నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్‌జీటీలను సమన్వయం చేసుకుని నియోజకవర్గంలోని అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వృద్ధిరేటు 15 శాతం సాధించేందుకు ప్రణాళికలు అమలు చేయాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో టిడ్కో, వ్యక్తిగత గృహాల కోసం ప్రభుత్వ భూమి లభ్యతను గుర్తించాలన్నారు. గృహ నిర్మాణం, లబ్ధిదారుల గుర్తింపు, నివేశ స్థలాల కోసం ఎంత భూమి అవసరమో నివేదిక ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలకు వీలైనంత త్వరగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో సీపీఓ విజయ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హిందూపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, డీఈఓ కృష్ణప్ప, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

నల్లచెరువు: పదో తరగతి విద్యార్థులపై మరింత శ్రద్ధ వహించి మెరుగైన ఫలితాలు వచ్చేలా చూడాలని ఆర్‌జేడీ శామ్యూల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఆర్డీడీ వెంట ఎంఈఓలు తిరుపాల్ నాయక్, చెన్నకేశవులు, హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సుభాన్, శ్రీనాథ్‌రెడ్డి, షఫి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ జగన్ హయాంలో హంద్రీ-నీవా కాలువలో పారుతున్న నీరు

రైతు నెత్తిన.. లైనింగ్ కత్తి

వర్షాధారంపై ఆధారపడిన జిల్లా రైతులకు హంద్రీనీవా జీవనాడి. కాలువలో నీరు పారితే ఆయకట్టుతో పాటు సమీప ప్రాంతాల్లోనూ భూగర్భ జల మట్టం పెరుగుతుంది. తద్వారా వేలాది ఎకరాల్లో పంటలు సాగవుతాయి. అందుకే 20 ఏళ్ల క్రితం వైఎస్ రాజశేఖరరెడ్డి హంద్రీ-నీవాకు రూపకల్పన చేశారు. ఆయన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా రైతులను దృష్టిలో ఉంచుకుని హంద్రీ-నీవా కాలువ పనులు పరుగులెత్తించారు. ఫలితంగా ఇప్పుడిప్పుడే జిల్లా రైతులు దుర్భిక్షం నుంచి బయట పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు మేలు చేయాల్సిన చంద్రబాబు.. తీవ్ర అన్యాయం చేసేందుకు సిద్ధమయ్యారు. నేరుగా కుప్పానికి నీరు తీసుకు వెళ్లేందుకు హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ చేసేందుకు సిద్ధమయ్యారు.

కుప్పానికి నీరు.. రైతుకు కన్నీరు

- హంద్రీ-నీవా లైనింగ్‌కు సిద్ధమైన కూటమి ప్రభుత్వం
- నేరుగా నీటిని కుప్పంకు తరలించేందుకు ప్రణాళిక
- ఇప్పటికే టెండర్లు పూర్తి... త్వరలోనే పనులు ప్రారంభం
- కాలువకు లైనింగ్ వల్ల జిల్లా రైతులకు తీరని నష్టం
- భూగర్భంలోకి నీరు ఇంకే మార్గం పూర్తిగా బంద్
- అడుగంటనున్న జలాలు.. బోరు బావులపై ప్రభావం

పుట్టపర్తి: హంద్రీ-నీవా ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి ఆరేళ్లుగా కృష్ణా జలాలు క్రమం తప్పకుండా జిల్లాకు వస్తున్నాయి. తద్వారా చెరువులు నిండి ఆయకట్టు భూములు పచ్చదనం సంతరించుకున్నాయి. కాలువ సమీప ప్రాంతాల్లోనూ భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు పుష్కలంగా వస్తున్నాయి. దీంతో చెరువు ఆయకట్టు రైతులతో పాటు కాలువ సమీపంలోని రైతులు పెద్ద ఎత్తున వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఉద్యాన పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలు ఎక్కువ రోజులు పారడంతో కాలువ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జల మట్టం పెరిగింది. బోర్లలో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు సంతోషంగా పంటలు సాగు చేస్తున్నారు.

రైతుకు అన్యాయం చేసేలా లైనింగ్..

హంద్రీ- నీవా కాలువ జిల్లాలో రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలో ప్రారంభమై ధర్మవరం, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో సాగి తనకల్లు మండలం నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వెళ్తుంది. సుమారు 180 కి.మీ మేర జిల్లాలో ప్రవహిస్తుంది. దీంతో కాలువ సమీపంలోని ప్రాంతాలన్నీ సస్యశ్యామలం అయ్యాయి. తాజాగా కూటమి ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొట్టేలా హంద్రీనీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేసేందుకు సిద్ధమైంది. దీంతో కాలువలో నీరు పారినా భూగర్భంలో ఇంకే పరిస్థితి ఉండదు. దీనివల్ల కాలువ సమీప ప్రాంతాల్లోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు చాలా ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సాధారణంగా కాలువ ఎత్తు ఉండి అక్కడ నీళ్లు కిందకు లీకేజీ అయ్యే చోట సిమెంట్ లైనింగ్ వేస్తే బాగుంటుందని, అలాకాకుండా కాలువ మొత్తం లైనింగ్ చేయటం వల్ల రైతులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కాలువ నీటితో రైతులు సాగుచేసిన వేరుశనగ

రూ.936.7 కోట్లతో పనులు..

అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్ 216వ కిలోమీటర్ నుంచి మొలకవేముల, పుంగనూరు బ్రాంచ్ కెనాల్, కుప్పం వరకు సుమారు 400 కిలోమీటర్ల మేర హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం రూ.936.7 కోట్లు కేటాయించింది. ఈ మేరకు టెండర్లు కూడా పూర్తి చేసింది. ఈ పనులు పూర్తయితే కాంట్రాక్టర్ల జేబులు నిండుతాయి. కమీషన్ రూపంలో ప్రజాప్రతినిధులకు మూటలందుతాయి. కానీ జిల్లా రైతులకు మాత్రం కన్నీళ్లే మిగులుతాయని జనం అభిప్రాయపడుతున్నారు. కాలువకు లైనింగ్ చేయడం వల్ల భూగర్భజలమట్టం తగ్గి వేలాది బోరు ఒట్టిపోతాయని, లక్షల ఎకరాలు బీళ్లుగా మారుతాయని చెబుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి..

కుప్పానికి కృష్ణా జలాలను తరలించాలన్నదే చంద్రబాబు లక్ష్యమని, అందుకోసమే నీరు ఇంకకుండా నేరుగా తన నియోజకవర్గానికి తీసుకెళ్లేందుకు సిమెంట్‌తో లైనింగ్ వేసేందుకు నిర్ణయించారని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా రైతులకు జరిగే అన్యాయంపై ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు స్పందించాలని, రైతుల కోసం చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి హంద్రీ-నీవా లైనింగ్ పనులు నిలిపివేసేలా చూడాలని కోరుతున్నారు.

రైతుల గురించి ఆలోచించాలి



హంద్రీనీవా కాలువకు లైనింగ్ వేసే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలి. రైతుల ప్రయోజనాల గురించి ఆలోచించి.. కాలువ దెబ్బతిన్న ప్రాంతాల్లో మాత్రమే పనులు చేపట్టాలి. అలాకాకుండా కాలువ మొత్తం లైనింగ్ చేస్తే మాకు ఏ మాత్రమూ ప్రయోజనం ఉండదు. కళ్లముందు నీరున్నా వాడుకోలేని పరిస్థితి నెలకొంటుంది. భూగర్భజలమట్టం తగ్గి పొలాలన్నీ బీళ్లుగా మారే ప్రమాదం ఉంటుంది.

– నిర్మల, రైతు, మరకుంటపల్లి, కొత్తచెరువు మండలం

లైనింగ్‌తో తీవ్ర నష్టం



హంద్రీనీవా కాలువకు అవసరమైన చోట మాత్రమే లైనింగ్ చేయాలి. కాలువ సమతలంగా ఉన్న చోట లైనింగ్ చేయటం వల్ల భూగర్భ జలాలు తగ్గి పోయి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. గడచిన ఆరేళ్లలో హంద్రీనీవా వల్ల భూగర్భ జలమట్టం పెరిగి వేలాది మంది రైతులు పెద్ద ఎత్తున పంటలు పండించారు. ఇప్పుడు కాలువ మొత్తానికి సిమెంట్ పూత పూయడం వల్ల ఈ ప్రాంతం మళ్లీ కరువుబారిన పడటం ఖాయం – రఘురామయ్య, రైతు, కొత్తకోట, బుక్కపట్నం మండలం

దోపిడీకే లైనింగ్



సీఎం చంద్రబాబు కాంట్రాక్టర్లకు దోచి పెట్టడం, తన నియోజకవర్గమైన కుప్పానికి నీళ్లు తీసుకుపోవటానికే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు శ్రీకారం చుడుతున్నారు. దీనివల్ల జిల్లా రైతులకు తీరని అన్యాయం జరుగుతుంది. కాలువ మొత్తం లైనింగ్ చేయటం వల్ల జలం భూమిలోకి ఇంకదు. దీంతో భూగర్భ జలాలు తగ్గిపోతాయి. తద్వారా బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉంది.

– ఆవుటాల రమణారెడ్డి, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు మాజీ చైర్మన్

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- కూటమి పాలనలో భౌతిక దాడులు, లైంగిక వేధింపులు నిత్యకృత్యం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించరు.. హోం మంత్రి పట్టించుకోరు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

పరిగి: ''కూటమి ప్రభుత్వం కొలువు దీరిన రోజు నుంచి రాష్ట్రంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు పెచ్చుమీరాయి. నిత్యం ఎక్కడోచోట మహిళలపై దాడులు జరుగుతున్నాయి. అయినా మహిళా పక్షపాతి అని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాత్రం ప్రశ్నించడం లేదు. ఇక హోం మంత్రిగా ఉన్న అనిత కూడా మహిళల రక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మహిళలు కన్నీరు పెట్టుకుంటే రాష్ట్రానికి మంచిది కాదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మహిళల రక్షణకు చర్యలు చేపట్టాలి'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ సూచించారు. బుధవారం ఆమె పరిగి మండలంలోని మోదాలో విలేకరులతో మాట్లాడారు. మహిళల రక్షణను పక్కనపెట్టిన కూటమి ప్రభుత్వం...దాడులు చేసిన వారిని రక్షించడానికి తాపత్రయపడటం, నేరస్తులను కాపాడేందుకు ప్రభుత్వ పెద్దలు పనిచేయడం సిగ్గు చేటన్నారు.

కిరణ్ రాయల్‌పై చర్యలేవీ?..

లక్ష్మీ అనే అమ్మాయిని వేధించి, దాడి చేసిన జనసేన పార్టీ నాయకుడు కిరణ్‌రాయల్‌పై ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గానీ, ప్రభుత్వం గానీ ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకున్నారో ప్రజలకు చెప్పాలని ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. కిరణ్‌రాయల్ తనను లైంగికంగా వేధించాడని లక్ష్మీ ఫిర్యాదు చేస్తే అతనిపై చర్యలు తీసుకోకుండా... బాధితురాలిపైనే చెక్‌బౌన్స్ కింద కేసులు పెట్టడమేమిటన్నారు. ఇంతకంటే దుర్మార్గం ఇంకోటి ఉంటుందా అని ప్రశ్నించారు. మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా తాను ప్రశ్నిస్తానని, సనాతన ధర్మాన్ని కాపాడతానని, మహిళల భద్రతే లక్ష్యంగా జనసేన పార్టీ నిలబడుతుందన్న పవన్‌కల్యాణ్... ఇప్పుడు ఎక్కడికి పోయారన్నారు. హోంమంత్రిగా ఉన్న అనిత కూడా ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు చెప్పాలన్నారు. నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళను కాపాడలేని హోంమంత్రి అనితకు ఆ పదవిలో ఉండే అర్హతే లేదన్నారు. సాటి మహిళకే న్యాయం చేయలేని హోంమంత్రి.. మహిళా భద్రతకు ప్రాధాన్యతనిచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారం కోసం ఎంతకైనా దిగజారడం, ఎన్ని అబద్ధాలైనా చెప్పడం కూటమి పార్టీల నేతలకే చెల్లిందన్నారు.

రైతులనూ విస్మరించారు..

కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు 9 గంటల నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తూ రైతుకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. అలాగే నేటికీ పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేకపోయిందన్నారు. మహిళలు, రైతులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వం త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు.

గోవిందా.. గోవింద



ప్రత్యేక అలంకరణలో పేట వేంకటరమణుడు

- వైభవంగా పేట వేంకటరమణుడి బ్రహ్మరథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- గోవింద నామస్మరణతో మార్మోగిన హిందూపురం



పేట వేంకటరమణ స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

హిందూపురం అర్బన్: గోవింద నామస్మరణతో హిందూపురం మార్మోగింది. వైకుంఠవాసుడైన పేట వేంకటరమణుడి బ్రహ్మరథోత్సవం బుధవారం కమనీయంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు భూదేవి, శ్రీదేవి సమేత వేంకటరమణుడి దర్శించుకుని పులకించిపోయారు.

దర్శనానికి పోటెత్తిన భక్తులు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పేట వెంకటరమణ స్వామి బ్రహ్మరథోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు..అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులే కాకుండా ఉమ్మడి అనంతపురంలోని పలు ప్రాంతాలు, పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. దీంతో చిన్నమార్కెట్ వద్ద ఉన్న ఆలయం పరిసరాలు భక్తులతో పోటెత్తాయి.

రమణీయం.. రథోత్సవం

వేద పండితుల మంత్రోచ్ఛారణలతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణుడి ఉత్సవ విగ్రహాలను చిన్నమార్కెట్ సర్కిల్ వద్ద ఉంచిన రథంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల బ్రహ్మాండనాయకుడి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథం లాగేందుకు పోటీ పడిన భక్తులు తమ ఇలవేల్పును తలచుకుంటూ గోవింద నామస్మరణ చేశారు. చిన్న మార్కెట్ వద్ద ప్రారంభమైన రథోత్సవం..మెయిన్ బజార్ సర్కిల్ వరకూ సాగింది. సాయంత్రం స్వామి రథాన్ని ఆలయం వద్దకు చేర్చారు. భక్తులకు పట్టణ హోల్‌సేల్ క్లాత్ మర్చెంట్స్ అసోసియేషన్, భాష్యం ట్రస్ట్, బాలాజీ సంఘంతో పాటు పలువురు అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, జేపీకే రాము, భగీరథ్ నవీన్, పట్టణ ప్రముఖులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

వేంకటరమణుడి సేవలో టీఎన్ దీపిక..

రథోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీ ఎన్ దీపిక వేంకటరమణుడికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆమెను వేదమంత్రాలతో ఆశీర్వదించి శాలువా, పూలహారాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేంద్రబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్ గౌడ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, న్యాతరెడ్డి, అయాబ్‌బేగ్, గిరి, కవిత రెడ్డి, వెంకటేష్‌రెడ్డి నవీన్, హరి తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

భయమేస్తోంది బంగారం

పెళ్లింట.. 'పసిడి మంట!

- రోజురోజుకూ ఎగిసిపడుతున్న ధరలు
- వివాహాలకు సిద్ధమవుతున్న కుటుంబాల్లో అలజడి
- మధ్యతరగతి కుటుంబాలు ఐదారు తులాలు కూడా కొనలేని పరిస్థితి
- చిన్న చిన్న స్వర్ణకారుల వ్యాపారాలు డీలా
- ఈ నెలాఖరులోపు ఉమ్మడి జిల్లాలో 4 వేల వివాహాలు!



ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిన్న బంగారు షాపులు
400 వరకు

ఉమ్మడి జిల్లాలో బ్రాండెడ్ బంగా నగల షాపులు
15 వరకూ

ఏటా మాఘమాసంలో జరిగే వివాహాలు
4,000 వరకూ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మాఘమాసం అంటేనే పెళ్లిళ్ల సీజన్. ఎప్పటినుంచో వేచిచూసిన యువతీ యువకులు ఈ మాసంలోనే ఒక్కటవుతారు. ఈనెలలో సుమారు 15 రోజుల పాటు మంచి ముహూర్తాలు ఉన్నాయి. తాజా అంచనాల ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫిబ్రవరి 28 లోపు 4 వేల పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా.

బంగారం.. భయం

పెళ్లి జరగాలంటే కాసింత బంగారు ఉండాల్సిందేనన్నది తెలుగువారి సెంటిమెంటు. కొత్తబట్టలు, పట్టుచీరలతో పాటు కచ్చితంగా బంగారు కొనాల్సిందేనంటారు. ఈ క్రమంలో పెరుగుతున్న పసిడి ధరలు పెళ్లివారిని ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. అసలే పెళ్లి సంబంధాలు కుదరక ఆలస్యంగానైనా పెళ్లి చేసుకుంటున్నాం కదా అనుకునే వేలాది జంటలు పసిడి ధరల తాకిడికి నీరస పడిపోతున్నారు. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం (ఆర్నమెంట్) రూ.80 వేలకు చేరిన నేపథ్యంలో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ఏ గ్రామంలో చూసినా ఇదే చర్చ సాగుతోంది. ఒక పెళ్లికి కనిష్ఠంగా పది తులాలు బంగారం ఉండాలి. అంటే ఒక్క బంగారుకే ఖర్చు రూ.10 లక్షలు అవుతుంది. వివాహానికి మరో రూ.10 లక్షలు వెరసి రూ.20 లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. దీంతో సామాన్య కుటుంబాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి.

క్యాష్ వద్దంటున్నారు..

గతంలో వరకట్నం గురించి డబ్బు పరంగా మాట్లాడుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. తమకు డబ్బు వద్దు మీ పాపకు బంగారం పెట్టుకోండి అని చెప్పేస్తున్నారు. దీంతో వధువు తల్లిదండ్రులు బంగారు ఆభరణాలపై మక్కువ చూపిస్తున్నారు. బంగారానికే రూ. లక్షలు పెడుతున్నారు.

క్లుప్తంగా

చికిత్సకు స్పందించక పసికందు మృతి


అంత్యక్రియలు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు

బత్తలపల్లి: తల్లి గర్భం నుంచి బయటపడిన నిమిషాల వ్యవధిలోనే ముళ్ల పొదల్లో చేరిన మగశిశువు... ఆస్పత్రిలో చికిత్సకు స్పందించక 24 గంటల తర్వాత బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బత్తలపల్లిలోని బీసీ గురుకుల బాలుర పాఠశాల సమీపంలో మంగళవారం ముళ్లపొదల్లో నవజాత శిశువును గుర్తించిన స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యులు సీపీఆర్ చేసి ఐసీయూలో ఉంచి చికిత్స మొదలు పెట్టారు. శిశువును కవర్లో చుట్టి పడవేసిన సమయంలో శిశువు తల వెనుక వైపు గాయమైనట్లుగా వైద్యులు గుర్తించారు. అంతేకాక శ్వాస తీసుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున శిశువు మృతి చెందడంతో ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం సాయంత్రం బత్తలపల్లి పోలీసులు, రెవెన్యూ, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది సమక్షంలో అంత్యక్రియలను పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వీఆర్వోపై దాడి


ఎస్‌ఐ మల్లికారునరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న వీఆర్వోలు

ఓడీచెరువు: రెవెన్యూ డివిజనల్ అధికారి జారీ చేసిన నోటీసు ఇచ్చేందుకు వెళ్లిన వీఆర్వోపై ఓడీ చెరువు ఉంట్లవారిపల్లికి చెందిన కొండన్న కుమారులు చంద్రశేఖర్; సూర్యనారాయణ దాడి చేశారు. వివరాలు... చంద్రశేఖర్, సూర్యనారాయణకు వారి దాయాదులతో కొంత కాలంగా భూ తగాదా నడుస్తోంది. ఈ క్రమంలో ఈ వివాదం ఆర్డీఓ కోర్టుకు చేరింది. దీంతో విచారణకు హాజరు కావాలంటూ ఆర్డీఓ జారీ చేసిన నోటీసులను ఇచ్చేందుకు బుధవారం ఉదయం తిప్పేపల్లి వీఆర్వో కొండప్ప.. ఉంట్లవారిపల్లికి వెళ్లాడు. ఆ సమయంలో ఆయనతో చంద్రశేఖర్, సూర్యనారాయణ వాగ్వాదానికి దిగి భౌతిక దాడికి పాల్పడ్డారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి కేసు నమోదు చేశారు. కాగా, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు వీఆర్వోల సంఘం నాయకులు రంగప్ప, రామప్ప, రమేష్, అంజి, నాగార్జున, అశ్విని, అల్లాబకాష్ తదితరులు వినతి పత్రం అందజేశారు.

స్టెమీతో గుండె పదిలం



గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేరిస్తే రోగికి పూర్తి రక్షణ

- ఒక్కో ఇంజెక్షన్ విలువ రూ.40 వేలు
- జగన్ హయాంలోనే స్టెమీ కార్యక్రమం అమలుకు శ్రీకారం

ప్రశాంతి నిలయం: గ్రామీనులు గుండె పోటుకు గురైతే చికిత్స కోసం పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రికి చేరుకునేందుకు దాదాపు 4 నుంచి 5 గంటల సమయం పడుతుంది. ఈ లోపు జరగరాని నష్టం జరిగి రోగి ప్రాణాలు కోల్పోవడం పరిపాటిగా మారుతూ వచ్చింది. ఈ పరిస్థితుల నుంచి గ్రామీణులను గట్టెక్కించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బృహత్‌కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అది ఇప్పుడు సత్ఫలితాలను ఇస్తోంది. డైరెక్టరేట్ ఆఫ్ సెకెండరీ హెల్త్ కింద నడుస్తున్న ఆస్పత్రుల్లో గుండె రోగులకు ప్రాథమిక చికిత్సలు అందించే సౌకర్యాలు మెరుగుపడ్డాయి. గుండెపోటుకు గురైన వ్యక్తిని గోల్డెన్ అవర్‌లోపు ఆస్పత్రికి చేరిస్తే స్టెమీ (ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫ్రాక్షన్) కార్యక్రమం ద్వారా రూ.40 వేల విలువైన థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్‌ను వైద్యులు ఇచ్చి వారి ప్రాణాలను కాపాడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో అందుబాటులోకి

స్టెమీ కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య శాఖ పక్కాగా అమలు చేస్తోంది. హిందూపురంలోని


కొత్తచెరువు కమ్యూనిటీ హెల్త్ సెంటర్

జిల్లాస్పత్రితో పాటు జిల్లాలోని మూడు ఏరియా ఆస్పత్రులు, ఏడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో స్టెమీ కార్యక్రమం అమలులో ఉంది. స్టెమీ కార్యక్రమం అమలైనప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాకు 253 ఇంజెక్షన్లు వచ్చాయి. ఇందులో 236 ఇంజెక్షన్లు వినియోగించారు. ప్రస్తుతం 17 ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. గుండె పోటుకు గురైన వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు థ్రాంబో లైసిస్ (టెంక్టేప్లేస్–40 ఎంజీ) సూది మందును జిల్లాస్పత్రిలో 10, ఏరియా ఆస్పత్రుల్లో 4, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 2 చొప్పున నిత్యం అందుబాటులో ఉంచారు. రోగి కొంత కోలుకున్న తరువాత యాంజీయో ప్లాస్టీ, హార్ట్ సర్జరీ కోసం అందుబాటులో ఉన్న ఆసుపత్రులకు తరలిస్తారు. స్టెమీ కార్యక్రమం అమలులో భాగంగా ఆయా ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలను గత ప్రభుత్వం సమకూర్చింది.

సద్వినియోగం చేసుకోవాలి



గుండెకు సంబంధించిన నాళాలలో రక్తం గడ్డకట్టడం ద్వారా నొప్పికి గురైన రోగిని మొదటి గంట (గోల్డెన్ అవర్) లోపు ఆస్పత్రికి చేరిస్తే ప్రాణాలు కాపాడవచ్చు. ఇందు కోసం స్టెమీ కార్యక్రమం కింద థ్రాంబోలైసిస్(టెంక్టేప్లేస్–40 ఎంజీ) ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచాం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ అశ్వత్థకుమార్, మెడికల్ ఆఫీసర్, కొత్తచెరువు సీహెచ్‌సీ

స్టెమీ కార్యక్రమం అమలైనప్పటి నుంచి ఇప్పటి వరకూ అందిన ఇంజెక్షన్లు

253

236 వినియోగించిన ఇంజెక్షన్లు

17 ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి


గుండెపోటుకు గురైన వ్యక్తికి థ్రాంబో లైసిస్ ఇంజెక్షన్ వేస్తున్న కొత్తచెరువు సీహెచ్‌సీ వైద్యుడు (ఫైల్)

వైద్యుడి అక్రమాలపై విచారణ

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆర్థో వైద్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి అక్రమాలపై వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు బుధవారం విచారణ చేపట్టారు. సదరం సర్టిఫికెట్ల మంజూరులో ఆయన పలు అక్రమాలకు పాల్పడినట్లుగా ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో విచారణాధికారులుగా నియమితులైన రాష్ట్ర సదరం ఇన్‌చార్జ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నాగలక్ష్మి, రాష్ట్ర బయోమెడికల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమశ్వేరరావు బుధవారం హిందూపురంలోని జిల్లాస్పత్రికి చేరుకుని వార్డులోని రోగులతో మాట్లాడారు. పలు అంశాలపై డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని విచారించారు. ఈ సందర్భంగా విచారణాధికారి డాక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిపై పలు ఫిర్యాదులు అందాయని, దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రాథమిక విచారణ చేపట్టామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.


డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని విచారిస్తున్న అధికారులు

బంగారం వర్తకుడి అరెస్ట్‌కు యత్నం

- అడ్డుకున్న బంగారం దుకాణాల నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: చోరీ సొత్తు కొనుగోలు చేశాడంటూ ధర్మవరానికి చెందిన ఓ బంగారం వర్తకుడిని అరెస్ట్ చేసేందుకు కర్ణాటక పోలీసులు చేసిన ప్రయత్నాన్ని స్థానిక బంగారం దుకాణాల నిర్వాహకులు అడ్డుకున్నారు. పావగడ సమీపంలో ఇటీవల దొంగతనాలకు పాల్పడిన యువకుడిని అరెస్ట్ చేసిన తిరుమణి పోలీసులు... విచారణ అనంతరం నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం ఉదయం ధర్మవరానికి చేరుకున్నారు. నిందితుడు చూపించిన దుకాణంలోకి వెళ్లి నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని జీపు ఎక్కిస్తుండగా స్థానిక బంగారం వర్తకులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. దీంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తిరుమణి పోలీసులు బంగారు వ్యాపారితో పాటు నిందితుడిని తీసుకెళ్లారు. అక్కడ నిందితుడు మాట మార్చి సదరు వ్యాపారికి తాను చోరీ సొత్తు విక్రయించలేదన్నాడు. దీంతో వర్తకుడిని కర్ణాటక పోలీసులు వదిలేసి వెనుదిరిగారు.

ఫ్యాక్టరీని తనిఖీ చేయొద్దు

- కర్ణాటక పోలీసులను అడ్డుకున్న సెంట్ ఫ్యాక్టరీ సిబ్బంది

అగళి: మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లి సమీపంలో ఉన్న సెంట్ ఫ్యాక్టరీని తనిఖీ చేయొద్దంటూ సిబ్బంది కర్ణాటక పోలీసులను అడ్డుకున్నారు. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా హోళలుగేరే సర్కిల్ సీఐ చిక్కన్నతో పాటు సిబ్బంది బుధవారం సెంట్ ఫ్యాక్టరీని తనిఖీ చేయడానికి వచ్చారు. కర్ణాటక ప్రాంతంలోని తోటల్లో పెంచిన గంధపు చెట్లను దుండగులు దొంగలించారన్న ఫిర్యాదులు వచ్చాయని, ఈ కేసు దర్యాప్తులో భాగంగా సెంట్ ఫ్యాక్టరీ తనిఖీకి వచ్చామని సీఐ చిక్కన్న తెలిపారు. వారు తమతో పాటు ఇంతకు మునుపు సెంట్ ఫ్యాక్టరీకి గంధపు చెక్కలు అందించిన చమన్ బాషాను వెంటబెట్టుకుని వచ్చారు. అయితే.. ఫ్యాక్టరీలో తనిఖీ చేయకుండా సిబ్బందితో పాటు కొందరు స్థానికులు అడ్డుకున్నారు. ఫ్యాక్టరీ బయటే చుట్టుముట్టి..ఇంతకుముందు అదే పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్‌ఐ తనిఖీల పేరిట హడావుడి చేసి 'సెటిల్మెంట్' చేసుకుని వెళ్లారని, ఇప్పుడు మళ్లీ రావడమేంటని ప్రశ్నించారు. దీంతో కర్ణాటక పోలీసులు అక్కడి నుంచి వెనుదిరిగి నేరుగా అగళి పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ జరిగిన విషయంపై ఎస్‌ఐ వీరేష్‌తో చర్చించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వకుండా నేరుగా ఫ్యాక్టరీలో తనిఖీలకు వెళ్లడం సరికాదని ఏఎస్‌ఐ శ్రీరాములు అన్నారు. ఇకమీదట ముందుగా సమాచారమిచ్చి రావాలని సూచించారు. దీంతో వారు కేసు పూర్వాపరాలు అందజేసి..దర్యాప్తునకు సహకరించాలని కోరి అక్కడి నుంచి వెనుదిరిగారు.


కర్ణాటక పోలీసులను అడ్డుకుంటున్న సెంట్ ఫ్యాక్టరీ సిబ్బంది

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

వజ్రకరూరు: జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి గాను విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ హోదాలో వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జోనాథన్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 5వ తరగతి (రెగ్యులర్), 6, 7, 8, 9వ తరగతులలో బ్యాక్‌లాగ్ అడ్మిషన్లు, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలు చేపట్టనున్నారు. అర్హులైన బాలబాలికలు దరఖాస్తులను ఈ నెల 15 నుంచి మార్చి 13వ తేదీలోపు https://mjpapbcwreis. apcfss. in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 27న, 6, 7, 8, 9 తరగతుల ప్రవేశార్హులకు ఏప్రిల్ 28న, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 20 ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చాటిన వారికి ప్రవేశాలు కల్పిస్తారు.

ఖైదీ మృతిపై విచారణ

హిందూపురం టౌన్: స్థానిక సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న లేపాక్షి మండలం మద్దిపి గ్రామానికి చెందిన టి.కొత్తపల్లి కదిరప్ప అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై పెనుకొండ సబ్ డివిజనల్ అధికారి ఆనంద్‌కుమార్ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. గత ఏడాది నవంబర్ 27న అనారోగ్యంతో ఖైదీ కదిరప్ప మృతి చెందడంపై అనుమానాస్పద మృతి కింద వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్డీఓ చేపట్టిన విచారణలో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అధికారులు వెల్లడించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు.

కమర్షియల్ ట్యాక్స్‌లో అవినీతిపై విచారణ

హిందూపురం అర్బన్: అనధికార తనిఖీలు.. అక్రమ వసూళ్లతో చర్చనీయాంశమైన హిందూపురం కమర్షియల్‌ట్యాక్స్ అధికారులపై విచారణ ప్రారంభమైంది. కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు అనధికారికంగా సర్కిల్ పరిధిలో తనిఖీలకు వెళ్లడం, వసూళ్లకు పాల్పడటంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఆశాఖ రాష్ట్ర స్థాయి అధికారులు స్పందించారు. విచారణ అధికారిగా వాణిజ్య పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్‌ను నియమించారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఆయన హిందూపురం విచ్చేశారు. తొలుత ఫిర్యాదుదారులతో కలిసి వివరాలు సేకరించారు. అనంతరం కార్యాలయంలో సీటీఓ వై.కృష్ణవేణి, డీసీటీఓలు, ఏసీటీఓలతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హిందూపురం వాణిజ్య పన్నుల కార్యాలయంలోని కొందరు సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడంతో విచారణ చేశామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కాగా, హిందూపురం కార్యాలయ పరిధిలో సిబ్బంది, కొందరు ప్రైవేట్ వ్యక్తులు రూ.90 లక్షల వరకు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది.


విచారిస్తున్న వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ మురళీమనోహర్

'కానిస్టేబుల్ భర్త దౌర్జన్యాలు అరికట్టండి'

అనంతపురం/టవర్‌క్లాక్: మహిళా కానిస్టేబుల్ భర్త ఆగడాలను అరికట్టాలని బాధితురాలు వేడుకుంది. అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను బాధితురాలు, అనంతపురంలోని నీరుగంటి వీధికి చెందిన లక్ష్మీదేవి వెల్లడించారు. ఆడిట్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవి భర్త కె.రమేష్‌బాబు 2023, నవంబర్ 30న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశాడు. నగరంలో కిరాణా కొట్టు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వ్యాపారం కోసం తనకు పరిచయమున్న మహిళా కానిస్టేబుల్ (గార్లదిన్నె పీఎస్)తో లక్ష్మీదేవి రూ.లక్ష అప్పు చేశారు. అయితే సక్రమంగా కంతులు చెల్లిస్తున్నా... కానిస్టేబుల్ భర్త మళ్లి తరచూ ఫోన్లు చేస్తూ నానా దుర్భాషలాడేవాడు. వడ్డీ వ్యాపారం చేస్తున్న తన భార్యకు చెల్లించాల్సిన రూ.లక్షకు గాను వడ్డీ, అసలు పోను రూ. 27వేలు బకాయి ఉందని, రోజూ తన కోరిక తీరిస్తే రూ.400 చొప్పున చెల్లింపు చేసుకుంటూ వస్తానంటూ లైంగిక వేధింపులకు తెరలేపాడు. ఇందుకు సంబంధించిన ఆడియో సంభాషణ తన వద్ద ఉందని బాధితురాలు వివరించింది. ఎలాగైనా కానిస్టేబుల్ భర్త దౌర్జన్యాన్ని అరికట్టాలని ఎస్పీకి ఫిర్యాదు చేసిన ప్రతిని పాత్రికేయులకు విడుదల చేసింది.

అధినేతను కలిసిన 'తోపుదుర్తి' బ్రదర్స్



రాప్తాడు రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారివెంట వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకుడు పేరూరు నాగిరెడ్డి, అనంతపురం రూరల్ మండల కన్వీనర్ బండి పవన్, ఆత్మకూరు మండల కన్వీనర్ బాలపోతన్న ఉన్నారు.

కదిలింది.. బ్రహ్మరథం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పావగడ: స్థానిక శనీశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం మధ్యాహ్నం 11.50 గంటలకు వైభవంగా సాగింది. స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఆలయ సమితి పదాధికారులు లాంఛనంగా బ్రహ్మరథాన్ని కదిలించారు. జై శనీశ్వరస్వామి అంటూ నినాదాలు చేస్తూ వేలాది భక్తులు రథాన్ని ముందుకు లాగారు. అంతకు ముందు ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం, రథోత్సవాగమనం, ఆవాహిత దేవతారాధన, సూర్యారాధన, విశేష అలంకారం తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మరథగో ధూళోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు.

16న జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక

ధర్మవరం అర్బన్: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గుంటూరు వేదికగా మార్చిలో జరిగే 15వ రాష్ట్ర స్థాయి సీనియర్ హాకీ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్టుకు ఈ నెల 16న క్రీడాకారుల ఎంపిక చేపట్టనున్నారు. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బంధనాథం సూర్యప్రకాష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరిగే ఈ ఎంపిక ప్రక్రియకు హాజరయ్యే క్రీడాకారులు వెంట ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకెళ్లాలి. 1991, జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు.

బావిలో పడి యువకుడి మృతి

చిలమత్తూరు: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన నాగరాజుకు భార్య, తండ్రి ఉన్నారు. మద్యానికి బానిసై నాగరాజు మంగళవారం రాత్రి తాగిన మైకంలో గ్రామ శివారులోని బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. బుధవారం ఉదయం బావి నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మంటలు ఆర్పే ప్రయత్నంలో వృద్ధుడి మృతి

లేపాక్షి: పొలాన్ని చుట్టుముట్టిన మంటలు ఆర్పే ప్రయత్నంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. లేపాక్షికి చెందిన మహబూబ్ (79)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న ఆయన గ్రామ సమీపంలో ఉన్న తన పొలం వద్దకు బుధవారం మధ్యాహ్నం వెళ్లాడు. అప్పటికే పొలానికి మంటలు వ్యాపించి ఉన్నాయి. విషయాన్ని గమనించిన ఆయన మంటలు సమీపంలోని గడ్డి వామికి వ్యాపించకుండా ఆర్పే ప్రయత్నం చేపట్టాడు. ఈ క్రమంలో పొగకు ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అవుతూ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులతో యువకుడి ఆత్మహత్య

లేపాక్షి: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన నరసింహమూర్తి (29) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఇటీవల ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో నరసింహమూర్తి అప్పు చేసి ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. కంతులు సక్రమంగా చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. ఈ క్రమంలో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు మొదలయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన బుదవారం ఉదయం గ్రామ శివారులో ఉన్న చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య ఉంది, సంతానం లేరు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ ఆయా బలవన్మరణం

అగళి: మండలంలోని వడగుంటనపల్లికి చెందిన అంగన్‌వాడీ ఆయా సరోజమ్మ (45) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పదేళ్ల క్రితం సరోజమ్మ భర్త మృతిచెందాడు. అప్పటికే ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు పెళ్లి చేసి అత్తారింటికి పంపింది. కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తూ ఒంటరిగా ఆమె జీవిస్తోంది. ఐదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కొన్ని రోజుల క్రితం బెంగళూరులో చికిత్స పొందింది. అయినా ఆరోగ్యం మెరుగు పడలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమారుడు రుద్రమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు సేవించి రైతు..


మృతుడు నాగభూషణ నాయక్

ధర్మవరం రూరల్: మండలంలోని నేలకోట తండాకు చెందిన రైతు నాగభూషణ నాయక్ (50) ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆయన బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయనకు భార్య కృష్ణమ్మ బాయి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైవీఆర్ కుడి కాలువకు గండ్లు


కాలువకు పడిన గండి పూడుస్తున్న రైతులు

ముదిగుబ్బ: యోగివేమన రిజర్వాయర్ నుంచి కుడి కాలువకు విడుదల చేసిన నీరు ఏటిపాలవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బలహీనంగా ఉన్న కాలువ గట్టుకు అధికారులు మరమ్మతులు చేపట్టడంలో అంతులేని నిర్లక్ష్యం కనబరిచారని, ఫలితంగా ఎక్కడికక్కడ కాలువకు గండ్లు పడి నీరంతా వృథా అవుతోందని తెలిపారు. గండ్లు పడిన విషయాన్ని అధికారులకు తెలిపినా వారి నుంచి స్పందన లేకపోవడంతో చివరకు రైతులే ఇసుక మూటలను ట్రాక్టర్ల ద్వారా తరలించి పూడ్చివేత పనులు చేపట్టారు.